# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- దేశంలో సంపద సృష్టి, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా బ్యాంకులు పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- ఐఎన్ఎస్ హిమగిరి, ఉదయగిరి యుద్ధ నౌకలను రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఈరోజు ప్రారంభించి జాతికి అంకితం చేశారు.

- వినాయక చవితి పండుగ వేడుకలను పర్యావరణహితంగా జరుపుకోవాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు.

- ఉత్తరాంధ్రలో గత 24 గంటలుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.

==============================

దేశంలో సంపద సృష్టి, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా బ్యాంకులు పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా బ్యాంకర్లు తమ విధానాలను మార్చుకోవాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో పలు సంస్కరణలను తీసుకొచ్చిందన్నారు. బ్యాంకులు, ప్రభుత్వ విధానాలు ఎప్పుడూ ప్రజలను నియంత్రించకూడదని, తదుపరి సంస్కరణల దిశగా వారిని ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో ఈరోజు ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. వన్ ఫ్యామిలీ - వన్ ఏంట్రప్రెన్యూర్ కార్యక్రమం, 175 నియోజకవర్గాల్లో ఎం.ఎస్.ఎం.ఈ. పార్కుల ఏర్పాటు వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 2047 నాటికి భారత్ బలమైన ఆర్థికవ్యవస్థగా తయారవుతుందని, అందుకు తగినట్లుగా బ్యాంకులు కొత్త ఆవిష్కరణల దిశగా ఆలోచనలు చేయాలన్నారు. రైతులు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బ్యాంకుల నిర్ణయాలు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

==============================

ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరి యుద్ధ నౌకలను రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఈరోజు విశాఖపట్నంలో ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఇండో-పసిఫిక్, చైనా సరిహద్దుల్లో చేపడుతున్న వ్యూహాత్మక రక్షణ ప్రాజెక్టు పనుల్లో భాగంగా పీ-17 పేరిట స్వదేశీ సాంకేతికత, ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థలతో కోల్‌కతా, ముంబయిలలో ఈ యుద్ధ

నౌకలను భారత రక్షణ వ్యవస్థ నిర్మించింది. తూర్పు నౌకాదళ ముఖ్య కేంద్రమైన విశాఖపట్నంలోని డాక్‌యార్డులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజ్ నాథ్ సింగ్ తో పాటూ నౌకాదళ అధిపతి అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠి, వైస్ అడ్మిరల్ రాజేష్ పెండార్కర్, అడ్మిరల్ వి.ఎస్. షెకావత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఇతర నేవీ అధికారులు పాల్గొన్నారు. అత్యాధునిక యుద్ధ నౌకలను రెండింటినీ జాతికి అంకితం చేసిన అనంతరం రాజ్ నాథ్ సింగ్ ప్రసంగిస్తూ... ఈ రెండు నౌకలు దాదాపు 149 మీటర్ల పొడవు ఉండి ఆధునిక ప్రత్యేకతలు కలిగి ఉన్నాయని చెప్పారు. ఈ నౌకలపై నుంచి సూపర్ సోనిక్, బ్రహ్మోస్ వంటి అస్త్రాలను నింగిలోని లక్ష్యాలకు ప్రయోగించవచ్చని రాజ్ నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

================================

వినాయక చవితి పండుగ వేడుకలను పర్యావరణహితంగా జరుపుకోవాలని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని 7 రోడ్ల కూడలిలో మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దిన్కర్ పుండ్కర్ తో కలిసి ఆయన ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... మట్టి వినాయక విగ్రహాలను వాడటం ద్వారా నదీ జలాలు కలుషితం కాకుండా కాపాడవచ్చని, భక్తి, ప్రకృతి రెండింటినీ పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేశారు. మన భక్తిని ఆచరిస్తూనే పర్యావరణాన్ని కాపాడుకుందామని అధికారులు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

================================

వివిధ రకాల సమస్యలతో సతమతమయ్యే బాధిత మహిళలకు అధికార యంత్రాంగం అండగా నిలవాలని, తగిన విధంగా తోడ్పాటు అందించాలని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చనా మజుందార్ పేర్కొన్నారు. వారు అందించే వినతులు, పోలీసు కేసుల విషయంలో చొరవ చూపాలని, పరిపాలనాపరమైన, న్యాయపరమైన సేవలను స్నేహపూర్వక వాతావరణంలో అందించాలని సూచించారు. "జన సునవాయి" పేరుతో విశాఖపట్టణం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈరోజు నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో బాధిత మహిళలు అందించిన పలు ఫిర్యాదులను పరిశీలించిన క్రమంలో జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఈ విధంగా స్పందించారు. క్లిష్టమైన పరిస్థితుల్లో స్వయం ఉపాధి కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా బాధిత మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని, మనోధైర్యం కల్పించాలని సూచించారు.

విరామం

================================

ప్రపంచానికి సాంకేతిక నిపుణులను అందించిన ఘనత భారత్ కే దక్కుతుందని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సి.హెచ్. నాగరాణి పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పర్యవేక్షణలో చేపట్టిన అమరావతి క్వాంటం వ్యాలీ హాక్ థాన్ 2025 సెమీఫైనల్స్ పోస్టర్ ను కలెక్టర్ ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశంలో చూసినా సాంకేతిక రంగంలో ప్రతి ఐదుగురిలో ఇద్దరు భారతదేశానికి చెందిన వారే ఉంటారని.. అది మన దేశం సాధించిన ఘనత అని చెప్పారు. ఇటువంటి హాక్ థాన్ వంటి కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, యువ మేధావుల్లో దాగి ఉన్న విజ్ఞానం జాతీయ స్థాయి పోటీల ద్వారా వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు టెక్నాలజీ, ఆవిష్కరణలను అందిపుచ్చుకోవడానికి క్వాంటం వ్యాలీ హాక్ థాన్ ఒక మార్గ నిర్దేశకంగా దోహదపడుతుందన్నారు.

================================

ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గంలో పలు ఎరువుల దుకాణాల గోడౌన్ లపై జాయింట్ యాక్షన్ కమిటీ ఈరోజు ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. జాయింట్ డైరెక్టర్ హబీబ్ బాషా ఇతర అధికారులతో కలిసి ఈ దాడులు నిర్వహించారు. యూరియా ఎరువులను అక్రమంగా నిల్వ చేసినా ఎటువంటి బిల్లు లేకుండా రవాణా చేసినా వారిపై కఠినమైన చర్యలు

తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. అదే విధంగా ధర్మాజీగూడెం గ్రామంలోని ఎరువుల షాపుల్లో తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు.

==============================

ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అనకాపల్లి జిల్లా రెవిన్యూ అధికారి (డిఆర్వో) వై.సత్యన్నారాయణ రావు రాజకీయ పార్టీలకు సూచించారు. ఓటర్ల జాబితా ప్రక్రియపై ప్రతీ నెల రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్న కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ రోజు కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్ లో వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటి వరకు కొత్తగా ఓటరు నమోదు, తొలగింపు, ఓటరు ఐ.డి. కార్డు సవరణల కోసం 1354 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 820 దరఖాస్తులను పరిష్కరించామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను ఆయన కోరారు.

==============================

ఉత్తరాంధ్రలో గత 24 గంటలుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలలో నిన్నటి నుండి భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఏజెన్సీలో భారీ వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతూ పంట పొలాలు నీట మునిగాయి. రహదారుల్లో రాకపోకలకు పలు చోట్ల తీవ్ర అంతరాయం కలుగుతోంది. జిల్లాలోని హుకుంపేట మండల కేంద్రంలో గల పాఠశాల ప్రాంగణంలో భారీ వృక్షం కూలడంతో విద్యార్థులను పాఠశాల భవనం నుండి సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఇదిలా ఉండగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు రాబోయే రెండు రోజులు కూడా భారీ వర్ష సూచన ఉంది.

==============================

ఒడిశా తీరానికి ఆనుకుని వాయువ్య బంగాళాఖాతంలో ఈరోజు ఉదయం 8 గంటల 30 నిమిషాలకు అల్పపీడనం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని సంబంధిత ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి సగటున 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఎత్తుకు వెళ్ళేకొలది నైరుతి దిశ వైపుకు వంగి ఉందని పేర్కొంది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదిలి రానున్న 2 రోజుల్లో మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలియజేసింది. దీని ప్రభావంతో రాగల రెండు రోజులకు వర్ష సూచనలను వాతావరణ అధికారి కరుణాసాగర్ వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

==============================
==============================